క్లుప్తంగా

పేద కుటుంబానికి బాసట



పైడమ్మ కుటుంబానికి ఆర్థిక సహకారం అందించిన వైఎస్సార్‌ సీపీ నేత నరసింహమూర్తి

కాకినాడ రూరల్‌: రమణయ్యపేట గ్రామంలోని గైగోలుపాడుకు చెందిన పేద కుటుంబానికి వైఎస్సార్‌ సీపీ జిల్లా కార్యదర్శి, మూర్తి స్కూల్‌ అధినేత పాలిక నరసింహమూర్తి బాసటగా నిలిచారు. భర్తను కోల్పోయి బాధలో ఉన్న దొంగల పైడమ్మకు నరసింహమూర్తి రూ.10వేలు ఆర్థిక సహాయం, రెండు మూటలు బియ్యం అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో గుబ్బల విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి వేణుగోపాలుని కల్యాణోత్సవాలు

బోట్‌క్లబ్‌: స్థానిక దేవాలయం వీధిలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 18 నుంచి 24 వరకు వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 18న స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకారం, అర్చన, ఈ నెల 19న ధ్వజారోహణం, గ్రామోత్సవం, స్వామి కల్యాణోత్సవం, 21న సదస్య మహోత్సవం, 23న పూర్ణాహుతి, చక్రతీర్థ మహోత్సవం, 24న శ్రీ పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరప: మండలం వేములవాడలో ఎన్నికల రోజున గ్రామ సర్పంచ్‌ కమిడి మంగాదేవి భర్త శంకర్‌పై జనసేన పార్టీ కార్యకర్తలు దాడిచేసిన ఘటనలో ఐదుగురు నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దూషించి, దాడిచేసినా నిందితులపై చర్యలు తీసుకోలేదని మంగళవారం రాత్రి కరప పోలీసుస్టేషన్‌ ఎదురుగా వేములవాడ గ్రామస్తులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన విషయం పాఠకులకు విదితమే.... కరపపోలీసులు ఆందోళనకారులకు ఇచ్చిన హామీ మేరకు బాధ్యులైన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తీసుకు వచ్చి, 41ఎ నోటీసులు జారీ చేశారు. ఇరువర్గాలతో చర్చలు జరిపి, నిందితులపై కేసు నమోదు చేశామని, విచారణ జరుపుతున్నామని చెప్పడంతో వేములవాడ గ్రామస్తులు వెనుతిరిగారు.

వేంకటేశ్వరుని మూలవిరాట్‌కు పూర్ణాభిషేకం



తాళ్లరేవు: భూసమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా బుధవారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో పూర్ణాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి కేశవాచార్యులు నేతృత్వంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సూర్యదేవుడిని దర్శించుకున్న ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సూర్యదేవుడిని దర్శించుకుంటున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణమూర్తి స్వామి వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు స్థానిక పార్టీ నాయకులు చింతా దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. చంద్రశేఖర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని కొంత సేపు ప్రత్యేక పూజల్లో కూర్చున్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బ్రహ్మార్పణ్‌కు 500 రోజులు

తాళ్లరేవు: లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్‌ ఉచిత భోజన పథకానికి 500 రోజులు పూర్తయ్యాయని క్లబ్‌ సభ్యులు తెలిపారు. ఎటువంటి ఆదాయం, ఆదరణ లేని పదిమందికి దాతల సహకారంతో స్వయంగా అభాగ్యుల ఇంటి వద్దకే క్యారేజీను అందజేస్తున్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి అమలు చేస్తున్న ఈ పథకం 500 రోజులు పూర్తి చేసుకోవడంపై క్లబ్‌ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఏటిగట్టుకు రోడ్డు వట్టిమాటేనా

- ప్రమాదభరితంగా రాకపోకలు
- ధ్వంసమైన రెయిలింగ్‌తో ఆందోళన
- అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని విన్నపం



శహపురం డ్రెయిన్‌పై రెయిలింగ్‌ ధ్వంసమైన వంతెన

కరప: శహపురం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం జరిగేనా అని మండల వాసుల నుంచి సంశయాలు వ్యక్తమవుతున్నాయి. వంతెన ఇరుకుగా ఉండి, రెయిలింగ్‌ ధ్వంసమై ప్రమాదభరితంగా తయారవ్వడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు, పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన మీదుగా ప్రయాణం దినదినగండం నూరేళ్ల ఆయుష్షు మాదిరిగా తయారైందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన వంతెనను పునర్నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోని అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని గొర్రిపూడి గ్రామ సమీపంలో శహపురం డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి, ప్రమాద భరితంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం చేస్తే, ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కరప, పెదపూడి మండలాల పరిధిలోని ఆరుగ్రామాల్లోని పంట పొలాల్లోని మురుగునీరు, ముంపునీరు శహపురం డ్రెయిన్‌ ద్వారా ప్రవహించి గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లో కలుస్తుంది. తుల్యభాగ డ్రెయిన్‌లో కలిసేచోట శహపురం డ్రెయిన్‌పై వంతెన నిర్మించారు. గొర్రిపూడి, వేములవాడ గ్రామాల మధ్య ఏటిగట్టు వెంబడి ఉండే రహదారి ఈ వంతెన మీదుగా సాగుతుంది. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలను అనుసంధానం చేసే ఈ వంతెన పైభాగంలో ఇరువైపులా ఉండే రెయిలింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. మండలంలోని వేములవాడ, వలసపాకల, వాకాడ, కరప తదితర గ్రామాల వారు కాజులూరు మండలం వైపు, అటు కోటిపల్లి, ద్రాక్షారామ వెళ్లాలన్నా, మండలవాసులు తాళ్లరేవు రిజిస్ట్రార్‌ కార్యాలయానికి వెళ్లాలన్నా ఈ వంతెన ఉండే రోడ్డు ద్వారానే ప్రయాణాలు సాగిస్తుంటారు. మండలంలోని గొర్రిపూడి, కొంగోడు, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కరప రావాలంటే ఇదే దగ్గర మార్గం. ఏటిగట్టు రోడ్డు ద్విచక్రవాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. రెయిలింగ్‌ దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కాలువలోకి పడిపోయే ప్రమాదముందని వాహనచోదకులు అంటున్నారు. రెయిలింగ్‌ ధ్వంసమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వేములవాడ ఏటిగట్టు రోడ్డు ఇటీవల ఆధునీకరించినా, ఈ వంతెన నిర్మించలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శహపురం డ్రెయిన్‌పై ఉన్న వంతెనను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదా రెయిలింగ్‌ అయినా ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన పునర్నిర్మించాలి



శహపురం డ్రెయిన్‌పై ఉన్న వంతెన నిర్మించి చాలా కాలం కావడంతో శిథిలావస్థకు చేరింది. వంతెనకు ఇరువైపులా ఉండే రెయిలింగ్‌ పూర్తిగా ధ్వంసమైంది. ఈ వంతెనపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. రాకపోకలు సాగించేటప్పుడు భయపడుతూనే వెళ్లాల్సి వస్తోంది. రైతులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉండే వంతెనను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

– అప్పనపల్లి పెద్ద, వేములవాడ

రైతులకు ఇబ్బందిగా ఉంది



వంతెనకు ఇరువైపులా ఉండే రెయిలింగ్‌ ధ్వంసమవ్వడంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి రైతులకు ఇబ్బందికరంగా ఉంటోంది. వంతెనపై నుంచి రెండెడ్ల బండ్లు వెళ్లేందుకు వీలులేక పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు, అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల ప్రజలు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– గుత్తుల సత్తిబాబు, వేములవాడ శివారు సిరిగలపల్లిలంక

కాటన్‌ సేవలు చిరస్మరణీయం

బాలాజీచెరువు: సర్‌ ఆర్థర్‌ థామస్‌ కాటన్‌ సేవలు చిరస్మరణీయమని జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్‌ డాక్టర్‌ సుమలత పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌ కాకినాడ లోకల్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో సర్‌ ఆర్థర్‌ కాటన్‌ 221వ జయంతి నిర్వహించారు. స్కూల్‌ ఆఫ్‌ ఫుడ్‌ టెక్నాలజీ విభాగాధిపతి, బయోటెక్నాలజీ ప్రొఫెసర్‌ డాక్టర్‌ మాలోతు రమేష్‌ అధ్యక్షత వహించగా విశ్రాంత ఎస్‌ఈ ఎస్‌.అర్జునరావు హాజరై కాటన్‌ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా వర్ధిల్లడానికి కారణం ధవళేశ్వరం వద్ద ఆయన నిర్మించిన బ్యారేజ్‌ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో ఈ ప్రాజెక్టు నిర్మించి దేశ వ్యాప్తంగా పేరొందిందన్నారు. భావి ఇంజినీర్లు కాటన్‌ను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి మేలుచేసే పరిశోధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాటన్‌ గొప్ప మానవతావాదని, ఆయన దార్శనికతను సేవాతత్పరతను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ చాప్టర్‌ కార్యదర్శి డాక్టర్‌ వి.జయప్రసాద్‌, కృష్ణారావు పాల్గొన్నారు.

ఆర్థర్‌ కాటన్‌కు ఘనంగా నివాళి

కాకినాడ రూరల్‌: అన్నదాత సర్‌ అర్థర్‌ కాటన్‌ జయంతిని బుధవారం సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్‌ వాకర్స్‌ సంఘంగా ఆధ్వర్యంలో నిర్వహించారు. కాటన్‌ చిత్రపటానికి ఆర్మీ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్‌, అడబాల రత్నప్రసాద్‌, రాఘవరావు, సత్యనారాయణ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

స్ట్రాంగ్‌ రూమ్‌ల సందర్శన



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు వేసిన సీల్‌ను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు



భద్రతా సిబ్బంది నుంచి వివరాలు నోట్‌ చేసుకుంటున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి జె.వెంకటరావు బుధవారం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌ రూమ్‌లను సందర్శించారు. జేఎన్టీయూకే సివిల్‌ బ్లాక్‌ ఆవరణలోని స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి ఇతర అంశాలపై ఎన్నికల అధికారులతో చర్చించారు. ఆయన వెంట ఏఆర్వో చల్లన్నదొర ఉన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారు : ఆర్వో

ప్రస్తుత ఎన్నికలలో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటారని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి జె.వెంకటరావు పేర్కొన్నారు. సిటీలో 72.07 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. 2016 ఎన్నికలతో పోలిస్తే ఈసారి సుమారు 6 శాతం ఓటింగ్‌ శాతం పెరిగిందని ఆర్‌ఓ చెప్పారు. యువకులు, మహిళలు, వృద్ధులు చైతన్యవంతులై పెద్ద ఎత్తున తరలివచ్చి ఓట్లు వేశారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్‌ బూత్లలో టెంట్‌ లు,మంచినీటి సదుపాయం వంటి అన్ని సౌకర్యాలు, కల్పించామన్నారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం సహకరించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

సమష్టి సహకారంతో ఎన్నికలు ప్రశాంతం

- స్ట్రాంగ్‌ రూమ్‌ల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు
- ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి రామారావు

పెద్దాపురం: ప్రతి ఒక్క ఓటరు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి సహకారంతో నియోజకవర్గంతో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని ఈఆర్వో, ఆర్డీఓ జేఎస్‌ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ ముగింపు నేపథ్యంలో కాకినాడ జేఎన్‌టియూ కళాశాలలో ఈవీఎంల స్ట్రాంగ్‌ రూమ్‌ వద్ద భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల్లో కూడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకర్గ పరిధిలో 2,15,095 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 13వ తేదీన నిర్వహించిన ఎన్నికల్లో 201 పోలింగ్‌ కేంద్రాల్లో 1,76,993 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పోలింగ్‌ శాతం 82.29 శాతానికి చేరిందన్నారు. అత్యధికంగా ఉలిమేశ్వరం గ్రామంలో 95.19 శాతం ఓటు నమోదు కాగా పెద్దాపురం అర్బన్‌ 81వ బూత్‌లో అత్యల్పంగా 54.38 శాతం పోలింగ్‌ నమోదైందని రామారావు తెలిపారు. వచ్చే నెల నాలుగో తేదీన కౌటింగ్‌ ఉంటుందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌటింగ్‌ ప్రక్రియకు సంబంధించి సిబ్బందికి శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను కూడా ప్రశాంతంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ రామారావు

పేద విద్యార్థులకు అండగా సేవలు

బోట్‌క్లబ్‌: పేద విద్యార్థులకు బర్రె నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు ట్రస్ట్‌ అండగా ఉంటుందని ట్రస్ట్‌ సభ్యులు వీఎస్‌ఎన్‌ మూర్తి అన్నారు. స్థానిక ట్రస్ట్‌ కార్యాలయంలో ట్రస్ట్‌ ఆధ్వర్యంలో 20 రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం బుధవారం విజయవంతంగా ముగిసింది. ట్రస్ట్‌ ద్వారా కాకినాడ పరిసర ప్రాంతాలలో విద్యా, వైద్యం, కెరియర్‌ గైడెన్స్‌, పోటీ పరీక్షల శిక్షణతో పాటు చలివేంద్రాలు, టైలరింగ్‌ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ట్రస్ట్‌ సభ్యులు భారతి, సత్యశాంతి, రామారావు, తాతారావు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ట్రస్ట్‌ సభ్యులు

ప్రశాంతంగా గ్రామీణం

- ఎన్నికల వేడి నుంచి తేరుకుంటున్న ప్రజలు
- ఎక్కడ చూసినా ఫలితాలపైనే చర్చలు

కాకినాడ రూరల్‌: సార్వత్రిక ఎన్నికల పోరు ముగియడంతో గ్రామాలలో ప్రశాంత వాతావరణం నెలకొంది. కొన్ని నెలలుగా ఎక్కడ చూసినా రాజకీయం గురించి మాట్లాడుకునే పల్లె ప్రజలు ఇకపై రాజకీయాలు పక్కన బెట్టి ముందుకు సాగే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల బరిలోని పార్టీలు, వాటి తరపున పోటీ చేసిన అభ్యర్థుల కోసం వర్గాలుగా విడిపోయి కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ నాయకులకు ఎన్ని ఓట్లు పోలవుతాయనే అంచనాల్లో గడుపుతున్నారు. జూన్‌ 4 వరకు ఓటరు తీర్పు స్ట్రాంగ్‌ రూమ్‌ల్లో భద్రంగా ఉండడంతో కొన్ని రోజులు విశ్రాంతి లేకుండా గడిపిన వారు కుటుంబ సభ్యులతో సరదాగా బయటకు వెళ్లేందుకు ప్లాన్‌ చేసుకుంటున్నారు. అదేవిధంగా అభ్యర్థులు కుదుట పడే ప్రయత్నం చేస్తున్నారు. మైక్‌ల హోరు, అభ్యర్థులు పర్యటనలు, సోషల్‌ మీడియా వేదికగా పోస్టింగులు ఇవన్నీ ఇప్పుడు కనిపించడం లేదు. అభ్యర్థులు తమ భవితవ్యంపై ఆశలు పెట్టుకుని ఫలితాల కోసం ఎదురు చూస్తుండగా పందాలు రాయుళ్ళు మాత్రం బెట్టింగ్‌లకు సై అంటున్నారు. ఎన్నికల వేడితో పాటు బుధవారం వాతావరణం చల్లబడడంతో జనాలు ఊరట చెందుతున్నారు.

ప్రపంచ ఆర్థోడాంటిక్‌ ఆరోగ్య దినోత్సవం

బోట్‌క్లబ్‌: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని సత్య దంత వైద్యశాలలో బుధవారం ప్రపంచ ఆర్థోడాంటిక్‌ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర కన్వీనర్‌ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎత్తు పళ్లు, వంగర పళ్లు ఉన్నవారు ఆర్థో డెంటిస్ట్‌ని కచ్చితంగా సంప్రదించాలన్నారు. ఎత్తు, వంకర పళ్లు ఉన్న వారికి గతంలో క్లిప్‌లు వేసేవాళ్లమన్నారు. ఈ తరహా వైద్య విధానంతో ఆహారం తీసుకునేటప్పుడు కొంచెం ఇబ్బంది ఉంటుందన్నారు. ఇప్పుడు క్లియర్‌ ఎలైనర్స్‌ వైద్య విధానం ద్వారా అత్యంత సుఖమైన, నొప్పిలేని వైద్యాన్ని అందజేస్తున్నారు. ప్రముఖ ఆర్థోడెంటిస్ట్‌ స్వరూప్‌ మాట్లాడుతూ మన ముఖంలో ఎత్తు, వంకర పళ్ల వరుసతో సౌందర్యపరమైన సమస్యలతో మన ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ఆర్థోడెంటిస్ట్‌ ద్వారా ఆ సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అసోసియేషన్‌ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు సిరాజ్‌, భవాని పాల్గొన్నారు.

రంగు ఉంటే.. రోగం పండినట్టే!



మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మామిడి పండ్లు

- మామిడికాయల పక్వానికి రసాయనాల వినియోగం
- కార్బైడ్‌ వాడకాన్ని నిషేధించిన ప్రభుత్వం
- నిగనిగలాడే రంగు చూసి మోసపోవద్దంటున్న ఆరోగ్య నిపుణులు
- పర్యవేక్షించని అధికారుల తీరుపై విమర్శలు

కొత్తపల్లి: నిగనిగలాడుతూ ఆకర్షణీయంగా మంచి రంగు తేలి, తియ్యటి రస మాధుర్యాన్ని అందించే మామిడి పండంటే ఇష్టం ఉండని వారుండరు. వేసవిలో లభించే ఈ మధుర ఫల ప్రియుల బలహీనతను ఆసరాగా చేసుకుని, కొందరు స్వార్థ వ్యాపారులు హానికర రసాయనాలు వాడుతూ, మామిడి పండ్లను అసాధారణ రీతిలో మాగబెడుతున్నారు. పండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, ఆకర్షణీయమైన రంగు వచ్చేందుకు అపాయకరమైన కాల్షియం కార్బైడ్‌ రసాయనాన్ని పిచికారీ చేస్తున్నారు. ఇటువంటి మామిడి పండ్లను తినడం వల్ల కేన్సర్‌ సోకే ప్రమాదం ఉందని, ఇది నాడీ వ్యవస్థపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు వంటి సమస్యలతో పాటు, జ్ఞాపక శక్తి నశిస్తుందని చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మామిడి తోటల నుంచి వ్యాపారులు గుత్తగా మామిడికాయలను కొంటుంటారు. అలా కొనుగోలు చేసిన మామిడి పండ్ల నిల్వలకు నిషేధిత రసాయలను వాడుతూ మగ్గపెడుతున్నారు. మార్కెట్లోకి రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సంప్రదాయ పద్ధతులే సురక్షితం

మామిడి పండ్లను మాగబెట్టడంలో సంప్రదాయ, సాంకేతిక పద్ధతులు పాటించడంలో ఎంతో మేలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ, ఎగుమతులకు అనువుగా మాగబెడితే మంచి లాభాలు ఆర్జించడమే కాకుండా, ప్రజలకు సురక్షితమైన పండ్లను అందించవచ్చని చెబుతున్నారు. పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా 1,908 ఎకరాల్లో మామిడిని రైతులు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలులో 1,744, పిఠాపురంలో 75, కొత్తపల్లిలో 89 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 3 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయి

రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లను తినడం వల్ల దీర్ఘకాలిక రోగాలు సంక్రమిస్తాయి. రసాయనాల ద్వారా పండించిన మామిడి పండ్లను తీసుకున్న వారికి గ్యాస్ట్రిక్‌ సమస్యలు, విరేచనాలు, వాంతులే కాకుండా, మనిషి పూర్తిగా నీరసించిపోయే ప్రమాదం ఉంది. రంగులు చూసి ప్రజలు మోసపోకుండా, ఎవరి ఆరోగ్యాన్ని వారే కాపాడుకోవాలి.

– సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి ఆరోగ్య కేంద్రం

కాల్షియం కార్బైడ్‌ ప్రమాదకరం



మామిడి కాయలపై కాల్షియం కార్బైడ్‌ పూయడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇలా వాడిన వారిపై ఆహార భద్రత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారు. ఇటువంటి మామిడి పండ్లు తినడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. రసాయనాలు పూసిన మామిడి పండ్లు తింటే నాలుక, పెదవులు మొద్దు బారినట్టు అనిపిస్తుంది. ఇలా అనిపిస్తే అటువంటి పండ్లను తినవద్దు. ఆరోగ్యకరమైన మామిడిపండ్ల ఉత్పత్తికి రైతులు, వ్యాపారులు సురక్షిత పద్ధతులు పాటించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు సంప్రదాయబద్ధంగా మగ్గబెట్టిన మామిడి పండ్లనే విక్రయించాలి.

– శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

ఆకుపచ్చ రంగులో తాగునీరు



ఫిల్టర్‌ బెడ్‌లో ఆకుపచ్చరంగులో ఉన్న నీరు



కుళాయిల ద్వారా నాచు రంగులో వచ్చిన తాగునీరు

సామర్లకోట: మున్సిపల్‌ కుళాయిల నుంచి వస్తున్న తాగునీరు బుధవారం ఆకుపచ్చ రంగులో రావడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఉండూరు రోడ్డులో ఉన్న నాగార్జున ఫిల్టర్‌ చెరువు లోని నీటిని సమీపంలో ఉన్న ఫిల్టర్‌ ప్లాంటు ద్వారా శుద్ధి చేసి గణపతినగరం, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకులను నింపుతారు. అక్కడి నుంచి ప్రజలకు పైప్‌ లైన్ల ద్వారా ఇంటి కుళాయిలకు తాగు నీరు సరఫరా అవుతుంది. అయితే ఫిల్టరు చెరువులో నీరు ఆకు పచ్చరంగులో ఉండటంతో ఫిల్టరు కావడం లేదని, చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ప్రజలు అంటున్నారు. మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామారావును వివరణ కోరగా తాగునీరు బ్లీచింగ్‌ వాసన వస్తోందనే ఫిర్యాదుల మేరకు క్లోరిన్‌, ఆలమ్‌ శాతం తగ్గించడం వల్ల నీరు కొద్దిగా నాచు రంగులో వచ్చిందన్నారు. గురువారం నుంచి క్లోరిన్‌ శాతం పెంచి నీరు స్వచ్ఛంగా వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు.